వి. రాజారామ మోహనరావు



# మనో స్వేచ్ఛ



పదహారేళ్ళ పార్వతికి భర్త రుద్రయ్యే జీవితంలో మొదటి మగాడు. భర్తతో గడిచిన మొదటి రాత్రి అన్నిరకాల అనుభూతులతో గడిచినా...ఆ తెల్లారేసరికి పార్వతికి.... వొళ్ళంతా నొప్పుల్లా అనిపించింది తప్ప సుఖంగా అనిపించలేదు....భయంగా అనిపించింది తప్ప.... భర్తంటే దగ్గరగా అనిపించలేదు.

ముచ్చటగా అని మూడు రోజులే తప్ప....మరో నాలుగు రోజులు తల్లీ, తండ్రి అలవాటున్న యిల్లు ఆ వాతావరణంతోనే గడిస్తే ఎలా వుండేదో కాని రుద్రయ్య ప్రయాణానికి హడావిడి చేశాడు.

వయసు అంతగా లేని పార్వతి పెళ్ళయిన నాలుగోనాడే విచిత్ర సంసారంలోకి....మరో వింతలోకంలోకి అడుగెట్టింది. ఇల్లులేని సంసారం వాళ్ళది....చూపు చొరబట్టానికి వీలులేకుండా నాలుగువేపులా తెరలు కట్టేసిన ఎద్దుబండే సంసారం.... అదే ఇల్లు.... ఆ బండికిందే వంట.... దాని నీడనే పడక.

నిలకడలేని చక్రాల జీవితానికి....అన్ని రకాల గాలివాటు సరదాలకి అలవాటుపడ్డ రుద్రయ్య ఒక్కోసారి తెగనవ్వుతూ మంచి సరదాగా వుండేవాడు....మళ్ళీ అంతలోనే ధుమధుమలాడుతూ రుద్రుళ్ళా మారిపోయేవాడు యీ ఆటూపోటూ కూడా తట్టుకోటం కష్టంగానే వుంది పార్వతికి

ఇద్దరు పిల్లల తర్వాత మిగిలిన ఆడపిల్లవటం వల్ల ఎంతో ముద్దుగా పెంచారు పార్వతిని తల్లీతండ్రి మేదరపని చేసే తల్లీ తండ్రీ దగ్గరుండి తను బుట్టలు, చాపలూ అల్లేది పార్వతి.... స్నేహితులు పని....సరదాలు ఆలోకమే వేరు. తండ్రి తరపు బంధువు రుద్రయ్య. చిన్నప్పట్నించీ అనుకున్న సంబంధం అవి చేశారు. పెళ్ళంటే ఏమిటో సరిగ్గా తెలియని పార్వతికి ఏమీ అనే అవకాశం లేకపోయింది. ఇంటిపట్టున వుండటం అలవాటైన పార్వతికి యిల్లూ, వాకిలీ లేని యీ సంసారం సరిపట్టంలేదు.

పోనీ యీమార్పు తాలూకు లోటునంతా కప్పిపుచ్చే భర్త అనురాగం వుంటే ఆ బతుకెలా వుండేదో....ఆ అవకాశం లేకుండా పోయింది.

వయసు నింపుకుంటున్న పార్వతి తనకి మంచి బాగానే వుందనుకోటం తప్ప ..పార్వతికి ఎలా వుంటోంది జీవితం అన్న ఆలోచనా, వోపిక లేకపోయాయి రుద్రయ్యకి. దీనికి తోడు నానా రకాల పనులు పార్వతి నెత్తినేశాడు. అలవాటులేని, అయిష్టమైన ఆ పనులు నిత్యం చెయ్యాల్సిరావటంతో మరింత కుంగిపోయింది పార్వతి.

యీడాది తిరిగేటప్పటికి ఆడదానిగా పూర్తి అనుభవం వచ్చేసింది పార్వతికి. అన్ని అయిష్టాలకి సద్దుకుపోతోంది. అయినా జీవితం యిబ్బందిగానే వుంటోంది.... ఏ ఒక్కటీ యిష్టంగా వుండటంలేదు. వుదయం, సాయంత్రం....వెన్నెల, చీకటి ఒక్కలాగే వుంటున్నాయి ఒక్క సంవత్సరంలో సెలయేటిలాంటి పార్వతి జీవితం కదలికలేని నీటికుంటలా మారిపోయింది.

కొంచెం సేద తీర్చేవో మాట పలికే చల్లటిగాలి కోసం, తనని ఒక్కక్షణమేనా నిరుత్సాహమైన తన సంసారలోకం నుంచి కుదిపి కదిపే పవనంకోసం పార్వతి మనసు ఆనాలోచితంగానే ఎదురుచూస్తోంది. సరిగ్గా అలాంటి సమయంలోనే మల్లయ్య కనిపించాడు.

మల్లెలమ్మ జాతర అది ఆ చుట్టుపక్కల వూళ్ళల్లో ఆ జాతరకి మంచి పేరుంది. ఆ జాతరలో తనమకాం పెట్టాడు రుద్రయ్య. యిది వరకటికన్నా యీ సారి జాతరలో సంపాదన బాగుండటంవల్ల మంచి హుషారుగా వున్నాడు రుద్రయ్య. మూడు రోజుల జాతర అది. అంతేకాక అయిదోనాటి నుంచి అక్కడే మరో గొప్ప దేవత ఎల్లమ్మ తిరనాళ్ళ జరుగుతాయి.

పెద్ద మార్పులేకుండా నిర్ణీతక్రమంలో నడిచే జీవితంనుంచి మంచి ఆటవిడుపు యీ జాతర ఆ చుట్టుపక్కల పల్లెజనానికి.

జాతరలో రకరకాల వింతలు .. వినోదాలు .. సరదాలు రుద్రయ్య బండి ఓ వింతవినోదం. దాని ఖరీదు జాతరలో అయితే రూపాయి. మిగిలిన సమయాల్లో అయితే అర్ధరూపాయి.

చుట్టూ తెరలు కట్టిన రుద్రయ్య బండిలో ప్రస్తుతం పన్నెండు వింత జంతువులున్నాయి. మూడు కొమ్ముల దుప్పి... అయిదుకాళ్ళ ఆవు....రెండు రంగుల కొండచిలువ....యిలా. స్వల్పమైన శారీరక వైచిత్రితో ప్రత్యేకత ఆపాదించిన జంతువులు. వాటిలో చాలా వాటిని రుద్రయ్య తండ్రి పోగుచేశాడు...మిగిలిన

వాటిని రుద్రయ్య పోగుచేశాడు. రుద్రయ్యకి చిన్నతనం నుంచీ యిదేవృత్తి... ఆ జంతువులు నిండిన బండే రుద్రయ్యకి జీవనాధారం.

ఆ జంతువులకి పరదాల మోషా...ఎక్కడో మరో నిర్జన ప్రదేశంలో తప్ప వాటిని బండిదింపడు. నలుగురి కంటపడితే వ్యాపారానికి నష్టం...వాటి ప్రత్యేకతపోతుంది.

కొత్తలో ఆ జంతువుల్ని....గాలి వెలుతురు లోపలికి రాని ఆ బండిని చూస్తే ఆసహ్యంగా వుండే పార్వతికి రానురాను అలవాటైంది. క్రమేపి ఆ జంతువుల మీద జాలికలిగింది. తమ దంటూ వో బతుకులేని ఆ జంతువుల్ని వదిలేసి మరో బతుకు చూసుకుందామని అయిదారుసార్లు రుద్రయ్యని బతిమాలింది. పార్వతి ఆ మాటలిన్నప్పుడల్లా అడ్డమైన తిట్లూతిట్టాడు రుద్రయ్య- చివరికి మరోసారి ఆ మాటెత్తితే వీపు చీరేస్తానన్నాడు...రెండు వేల రూపాయలకి బేరం వచ్చినప్పుడే అమ్మలేదన్నాడు...ఆ తర్వాత పార్వతి అప్రసక్తి వదిలేసింది.

బండి వదలలేని ఆ జంతువులకి, ఆ బండి పరిసరాలు దాటని రుద్రయ్యని అంటి పెట్టుకుని బతికే తనకి ఏదో సామీప్యం. ఐక్యత కనిపించాయి పార్వతికి.

ఆ పన్నెండు రకాల జంతువుల విసర్జనలు నిత్యం శుభ్రం చెయ్యటం కొత్తలో మహానరకంలా వుండేది పార్వతికి ఆమె కొత్త సంసారపు కోరికలకి...యీ బతుక్కి సంబంధమేలేదు. ఆరు బైటకూచుని బుట్టలల్లేపట్ప్పుడు చేతికొసల్ని మెత్తగా తాకే వెదురు బద్దల వాతావరణానికి... జంతువుల సేవకి పరిమితమైన యీ సంసారానికి లంగరందటంలేదు పార్వతికి. పార్వతి వచ్చిదగ్గర్నుంచి జంతువుల గురించి పూర్తిగా పట్టించుకోటం మానేశాడు రుద్రయ్య. అంతేకాక వాటి విషయంలో ఏ మాత్రం లోటు కనిపించినా వూరుకునే వాడుకాదు

పార్వతి సంసారానికి పెద్దగా సామానులేదు. మూడు గిన్నెలు రెండు గ్లాసులు, రెండు ప్లేట్లు ..అయినా అవంటే ఎంతో మమకారం పార్వతికి వాటినితాకినప్పుడు....శుభ్రం చేసేటప్పుడు.. చేతుల్ని...చర్మపు కొసల్ని దాటి స్పర్శానుభూతి ఆమెని ఆక్రమించేది....ఖుంచుమించు అటువంటి స్పర్శాభావం కోసం రుద్రయ్యని చాలాసార్లు వెతికింది పార్వతి.

తనని ముట్టుకున్నప్పుడు...బండిలో జంతువుల్ని ముట్టుకున్నప్పుడు రుద్రయ్య ముఖం, చూపు ఒకేలా వుండటం ఏమాత్రం మార్పులేకపోవటం పార్వతి మనసుని మరింతగా బాధించింది.

బంతిపువ్వు వో రకం....గులాబీ పువ్వు మరోరకం అని ఆడదానిగా ఎలా అర్థం చేసుకుందో రుద్రయ్య తీరుని అలాగే అర్థం చేసుకుంది పార్వతి. అతనితో సర్దుకు పోవాలనే ఆమె ప్రయత్నం కానీ ఎంత ప్రయత్నించినా రెండు విషయాలలో మాత్రం రుద్రయ్యతో సరిపెట్టుకోలేక పోతోంది. చెప్పుకుంటే చాలా మంచి దృష్టిలో అతిచిన్న విషయాల్లానే కనపడినా పార్వతి సున్నితమైన మనసుకి తట్టుకోలేని విషయాలయ్యాయి అవి.

మోతాదుమించి తాగినప్పుడు వో వికృతమైన జంతు ప్రవృత్తికి లోనయ్యేవాడు రుద్రయ్య. ఆ సమయాల్లో అతనితో పడక చాలా అసహ్యంగా వుండేది పార్వతికి. అ సమయంలో శారీరకంగా కొంచెం మోటుగా ప్రవర్తించే రుద్రయ్య తీరుకన్నా.. అతని వెకిలి ప్రవర్తన...దిగజారిన సరదాలు....తనతో వున్నది మనిషి అన్న స్పృహలేని అతని నీచత్వం పార్వతికి దుర్భరంగా వుండేవి. ఆ సమయంలో రుద్రయ్య నోటివాసన పార్వతి భరించలేకపోయేది. ఆ వాసన జంతువులున్న బండిని గుర్తుతెచ్చేవి... ఆ నోటి వాసనని తనకి దగ్గరగా రానివ్వద్దని ఎంతగానో బతిమాలింది పార్వతి చాలాసార్లు....బతిమాలిన కొద్దీ వెకిలిగా నవ్వి.... మరింత వెకిలిగా పార్వతి ముఖాన్ని ఎంగిలి మయం చేసేవాడు రుద్రయ్య....వెకిలితనంలోని అవ్యదిక్తత ఆ సంతృప్తి రుద్రయ్యకి మరెందులోనూ లేదేమో అన్నట్టుండేది అతని ప్రవర్తన...

మరో విషయం....ఏడాది దాటినా తల్లీతండ్రిని చూడనివ్వలేదు రుద్రయ్య. పార్వతి అడిగినప్పుడల్లా ఏదో సాకులు చెప్పాడు. చివరికి వుద్రిక్త సమయంలో అతను చెప్పిన నిజం ఏమిటంటే....మీ అమ్మానాన్నని చూస్తే . అక్కడి కెడితే తిరిగి నువ్వురావు.... అని... అటువంటి ఉద్దేశం పార్వతిలో మచ్చుకేనా లేదు. అతని అనుమానం తనమీద ఆతనికున్న నమ్మకం ఎంతో తెలిసొచ్చింది పార్వతికి....తనచుట్టూ కళ్ళకి కనిపించకుండా నెలకొన్న జైలు రుద్రయ్య....

జంతువులు...వంటా...తిండి ..రుద్రయ్య తప్ప మరో వేపు మనసు కూడా కదలటం మానేసిన సమయంలో మల్లయ్య ఆ జాతరలో కనిపించటం పోయిన ప్రాణాలన్నీ తిరిగి వచ్చినట్టనిపించింది పార్వతికి. మల్లయ్య పార్వతి వూరివాడే కాదు.... పార్వతితో కలిసిపెరిగాడు....కలిసి బతికాడు...రుద్రయ్య బంధుత్వం లేకపోతే మల్లయ్యే పార్వతి బతుక్కి మగాడయ్యుండేవాడు.

మల్లయ్య కనిపించగానే పార్వతి తల్లీతండ్రీ గురించి అడిగింది...నువ్వేల్లా వున్నావంది. తన వాళ్ళందరి గురించీ అడిగింది...వూరంతటినీ పలవరించింది. ఎన్నోరోజుల మాటలన్నీ మాట్లాడేసింది....మల్లయ్య అన్నింటికీ బదులు చెప్పాడు....చెప్పి....

---

ఈయనే మా పక్కింటాయన.. కొత్త రైల్వేలో వుద్యోగం వచ్చిందిట లెండి.. అదే బాధయి..



చివరికి.... 'నువ్వెలావున్నావు....' అన్నాడు.

ఆ మాటకి గుండె కదిలింది పార్వతికి... కళ్ళనిండుగా నీళ్ళు తిరిగాయి... జలజలా కన్నీళ్ళు రాలాయి...

"ఏమిడీ, ఏమిటని".... కంగారు పడ్డాడు మల్లయ్య....

"అబ్బే ఏం లేదండి...." పార్వతి....అని నవ్వు తెచ్చుకుంది.... నవ్వింది....

వీళ్ళిద్దర్నీ చూశాడు రుద్రయ్య....మల్లయ్య ఎవరో చెప్పింది పార్వతి...

ఒకటికి రెండు రోజులు గడిచాయి.... మల్లయ్య వీళ్ళతో వుంటూ వచ్చాడు. మల్లయ్య రాకతో పార్వతి ముఖంలో వచ్చిన మార్పు గమనించలేకపోయినా.... రుద్రయ్యకి మల్లయ్య తమతో వుండటమే బాగుంది.

జంతువులకి మేత కొనక్ఖర్లేకండా అక్కడికీ యిక్కడికి వెళ్ళి చాలావరకూ మేపేసుకొస్తున్నాడు. బండి దగ్గరుండి చెప్పినట్టు అరిచి రుద్రయ్య శ్రమ తగ్గించాడు. మరి కొంచెం విశ్రాంతిగా విలాసంగా వుంది రుద్రయ్య జీవితం.

మూడోనాటికి.... మనసు కుదుట పడ్డాక అడిగింది పార్వతి మల్లయ్యని ఏమిటిలా వచ్చావు అని.. పెద్దగా మాటకారి కాకపోయినా మెమ్మదిగా తన మనసంతా చెప్పాడు మల్లయ్య...


"పెళ్ళయి నువ్వెళ్ళిందగ్గర్నించీ....నాకలాగో వుంది.... ఆ వూరే బాగోలేదు...ఏం చెయ్యాలో తోచేదికాదు....ఏ పని మీద మనసులేదు...నిన్ను చూడాలనివుంది...ఎక్కడికి రాను....నువ్వే ఓ మాటువస్తావని చూశాను..నువ్వు రాలేదు....దీనికితోడు మా అయ్య నాకు మనువు ..మనువులని మొక తెస్తూను....అందుకని పారిపోయి వచ్చా...రెండు నెలలు తిరగ్గా యిక్కడ నువ్వు కనిపించావు.." అన్నాడు.


మల్లయ్య చెప్పిన మాటలకన్నా మరినాలిగింతలు అర్థమైంది పార్వతి ఆడ మనసుకి పరిస్థితి. మల్లయ్యతో బతుకు అన్న వూహకే వొళ్ళు జలదరించింది పార్వతికి....మనసు కొత్తగాలి పీల్చుకుని పులకరించింది. మనికాస్సేపు "తప్పేమో..." అనుకుంది....ఎవరినేనా అడిగితే అనుకుంది...ఏ సలహా అడగటానికేనా ఎవరున్నారు ... ఎవరూలేరు ... కొంచెం చనువుగా మాట్లాడే కాంతమ్మని అడగాలి....అయినా పార్వతికి అలాగ చెయ్యాలనిపించలేదు....ఎవరు ఏ సలహా చెప్పినా తన మనసు మరో మాట వినదనిపించింది.

అంతే పార్వతి అలా నిర్ణయించుకున్న ఆ రోజే మల్లయ్యని తన బతుకులో శరీరంలో కలుపుకుంది. ఆ మర్నాడు తెల్లారు ఝామున మల్లయ్యతో వెళ్ళిపోతున్న పార్వతి బండిముందు వో నిముషం ఆగింది....మల్లయ్య పార్వతి చెయ్యిపుచ్చుకునిలాగాడు. వాడిచేతి స్పర్శతో, కదలికలో ముందుకు నడిచింది పార్వతి.

° ° ° °

బాగా తెల్లారిన రెండుగంటలకి కానీ పార్వతి లేదన్న





TARA/BTC/41/85/TEL.

విషయం తెలిసిరాలేదు రుద్రయ్యకి.

మల్లయ్య కూడా కనిపించటం లేదన్న విషయం తెలిశాక మరింతకంగారు పడ్డాడు రుద్రయ్య. ఆలోచిస్తుంటే పార్వతిలేని జీవితం శూన్యంలా తోచింది. పిచ్చెక్కినట్టు ఆ చుట్టు పక్కలంతా వెతికాడు ఆ రోజు.... ఆ మర్నాడు వెతికాడు....

మూడో నాటికల్లా తెలిసిపోయింది రుద్రయ్యకి పార్వతి తనబతుకులోంచి వెళ్ళిపోయిందని పూర్తి ఆనారోగ్యంలోనూ, పరిస్థితులు అకస్మాత్తుగా మారినప్పుడు మనిషి జీవితంలో విలువలన్నీ తల్లకిందులవుతాయి. రుద్రయ్యకి జీవితం అంతా తల్లకిందులుగా వుంది.

పార్వతిని అతనెలా చూసినా....ఆమె తాలూకు...వాసు వాసనకి అతని జీవితం అలవాటుపడింది. స్వచ్ఛత, మంచితనం రుచి అతనికి తెలియకుండానే ఆమె ద్వారా అతనిలో ప్రవేశించాయి. పార్వతి లేని యీ రాత్రిళ్ళకు స్వర్గంలాంటి జీవితం దుర్భరంగా ఉంది.

తిరణాళ్ళ మామ్ములుగా నడుస్తున్నా వ్యాపారం మీద శ్రద్ధలేదు. జంతువులకి మేత కూడా వెయ్యటంలేదు రుద్రయ్య. రేకెత్తినట్టు తాగటం...వొళ్ళు తెలియకుండా పడుకోటం తప్ప ఏం చెయ్యలేకపోతున్నాడు.

తాగినమత్తూ ఎక్కువసేపు వుండటంలేదు. తిండీతిప్పలూ లేక శవంలా మారిన రుద్రయ్యని చూశ్శాక ఇంత అన్నం తీసుకుని వచ్చింది కాంతమ్మ. అరవైఏళ్ళ కాంతమ్మని "అత్తమ్మా" అంటాడు రుద్రయ్య.

కాంతమ్మ మనవరాలు లక్ష్మికి రెండుచేతులు లేవు. కాళ్ళతో రకరకాల పనులు చేస్తుంది. సూదిలో దారం ఎక్కించటం.... దీపం వెలిగించటం....లాంటి పనులతో....అవిటివినోదం చూపించి బతికే శాతర బతుకే కాంతమ్మదీనూ....


కాంతమ్మ వచ్చి అన్నంపెట్టి రుద్రయ్య చేత బలవంతంగా తినిపించింది....రుద్రయ్య అన్నం తింటుండగా "నువ్విలా అయిపోటం ఏం బాగోలేదు అల్లుడు...." అంది.

రుద్రయ్యకి బదులు చెప్పటానికి మాటలురాలేదు. కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. కొంచెం తేరుకున్నాక "పార్వతి యిలా ఎళ్లి పోతుందనుకోలేదు....అత్తమ్మా" అన్నాడు.

"అనుకున్నా, అనుకోకపోయినా అమ్మాయి అలా ఎళ్లి పోటమే మంచిది రుద్రయ్య..." అంది కాంతమ్మ నెమ్మదిగా

"అదేమిటి...." అన్నట్టు అయోమయంగా చూశాడు రుద్రయ్య.

"అంతే అల్లుడూ...కొన్ని పనులు మనం చెయ్యలేం... లక్ష్మిని చూడు...దాంది అవిటి బతుకు...మీ బండిలో జంతువుల్లాగే దానిది చీకటి గుడారం బతుకే ..నాలుగేళ్ళ క్రితం వొకడి మీద మనసు పడింది...వాడూ మనువుకి యిష్టపడ్డాడు. నేనే ఒప్పుకోలేదు .. యీ ముసలి బతుక్కి తిండి ఎలాగని....వొప్పుకో లేదు...ఇప్పుడు లక్ష్మిని చూస్తుంటే గుండెతరుక్కుపోతోంది. దాన్ని చూడలేను....చూడకుండా వుండలేను....నా బలవంతంవల్లే అది బతుక్కి దూరం అయింది. నీ పార్వతీ అంతే...తనది యీ



బతుక్కాదు....యిందులో వుండలేదు. వున్నకొద్దీ యిద్దరికీ ఎప్పటికో అప్పటికి బాధే...అందుకే చెపుతున్నా..యింక అధ్యాస వొదిలేసి...బతుకు..." అంది. అరవైఏళ్ళ కాంతమ్మ జీవితంలోని సారం అరగంటలో చెప్పలేకపోయినా రుద్రయ్యకి చాలానే చెప్పింది.

మర్నాటి నుంచి రుద్రయ్య తిరిగి మనిషవ్వాలని ప్రయత్నించేశాడు. శరీరం వరకూ సద్దుబాటు కుదిరినా మనసు కుదుట పట్టంలేదు. బండిదగ్గరికి వెళితే చాలు పార్వతే గుర్తొస్తోంది. ఎప్పుడూ లేంది బండిలోపలి జంతువుల్ని చూస్తే యిబ్బందిగావుంది. బండిలో తాళ్ళతో కట్టింది వాటినికానట్టు...తననే తను కట్టేసుకున్నట్టు....ఆ బంధం వూపిరి ఆడనట్టు వుంది రుద్రయ్యకి.

ఆ చోటు మారాడు...మరి రెండు వూళ్ళుమారాడు...

అయినా రుద్రయ్యకి మనసు కుదుటపడలేదు. తను కదిలినా తన చుట్టూవున్న బోనుతోపాటే కదులుతున్నట్టుంది. బండిలోని జంతువుల్తో యింకాతను పార్వతినికట్టేసికూడా తిప్పుకుంటున్నట్టే వుంది. పార్వతి లేకపోయినా...పార్వతి తిరిగి రాకపోయినా... పార్వతిలాంటి జీవితం కావాలన్న కోరిక రుద్రయ్యని గట్టిగా పట్టుకుంది.

తనని బంధిస్తున్నదేమిటో తెలిశాక యింక ఆ బంధిఖానాలో వుండాలనిపించలేదు. ఆ రాత్రి ఎప్పుడూ తాగనంతగా తాగాడు రుద్రయ్య. జీవితం, వొళ్ళు మరిచిపోయేలాతాగి...ఆ తాగటం గుర్తులోనే చెయ్యాలనుకున్నపని సవ్యంగాచేశాడు. మారువేరం చూసుకోకుండా జంతువులతో సహా బండిని వోదశారికి యిచ్చేశాడు. పార్వతి వెళ్ళిపోయిన బాధలేదు. తనూ మరో బతుక్కి వెడుతున్నాడు.

వెన్నెల్లో...చాలా ఏళ్ళకి వొంటరిగా నడుస్తున్న రుద్రయ్యకి నిబ్బరంగా వుంది. తన చుట్టూ చాలా విశాలంగా వున్నట్టుంది యిన్నాళ్ళుతనని నొక్కిపట్టి తనతో పాటే కదిలిన ఖైదు దూరమైనట్టుంది. అది కొత్తజీవితంలాగే వుంది...

*

